# జోగి-జోగి

బులుసు - జీ - ప్రకాష్

చిదానందానికి జీవితంమీద విరక్తి కలిగింది. లక్ష్మీకటాక్షంలేని వెధవబ్రతుకు బ్రతికేకన్నా, ఏ హిమాలయాలకో పోయి సన్యసిద్దామనిపించింది. వైరాగ్యంచెంది, దండకమండలపాణియై, గుండు గీయించుకుని, సర్వతంత్ర స్వతంత్రజీవితం గడపడానికి సరియైన సమయం యిదే. ఈ కౌమారదశలోనే, ఈ యువక వయస్సులోనే సన్యసించి రామాకృష్ణా అనుకోడం మంచిది. శరీరం శాశ్వతం కాదు. అన్నీ క్షణిక సౌఖ్యాలే! భవిష్యత్‌లో ఏమౌతామో, ఎక్కడుంటామో, ఎలా వుంటామో తెలీదు. ఇప్పటికిప్పుడే రాబోయే ఒక్క సెకండులో ఎలావుంటామో తెలీదు.

ఊళ్ళోకేదో క్రొత్తసినిమా వచ్చిందంటే, భార్యాపిల్లలతో సరదాగా రోల్సురాయ్సులో బయల్దేరి, పెద్దలారీని గుద్దించి, కారు పచ్చడికాగా, సకుటుంబ సపరివార సహితంగా జిల్లాకలక్టర్ లక్ష్మీకాంతరావుగారు వైకుంఠం చేరలేదా?

గ్రామంలో పేరుపడ్డ మోతుబరీ, ఒకపిల్ల జమీందారు, కీర్తిని నల్దెసలా వ్యాపింపజేసుకుని. రావుబహదూర్ బిరుదు సంపాదించ యత్నించి, మహాసదస్సులో, బిరుదు పరిగ్రహించబోతూ, ఉపన్యాసవేదికపైనే కైలాస శిఖరం చేరలేదా?

భవిష్యజ్జీవితం ఊహాతీతం. అందుకే, దేహం కాస్త దృఢంగా వున్నప్పుడు, తల నెరిసిపోయి వార్ధక్యం ఆవహించకుండా వున్నప్పుడు, పరమేశ్వర చరణస్మరణచేసి, శరణుపొందాలి. భగవత్సాన్నిధ్యం సంపాదించాలి. దీపం వుండగానే యిల్లు చక్కబెట్టుకోవాలి.

వీపుమీద ఎవరో చేత్తో తట్టినట్టయి, యోచనలన్నీ భగ్నం కాగా, చిదానందం వెనక్కిచూశాడు. శైశవమిత్రుడు గురుచరణం. ఒకచేతిలో పుష్పాలు, వేరొకచేతిలో గంగోదకంగల రాగిచెంబు, నుదుటిపైవిభూతి మధ్యని తిలకం, పైమీద గావంచా, పట్టు ధోవతి ధరించి శుద్ధ వైదీకబ్రాహ్మడిలా, పూజామందిరానికి వెళ్తూన్న దైవభక్తునిలాగ వున్నాడు.

"ఏమిట్రా చిదానందం ఆలోచన?" అన్నాడు గురుచరణం.

అసలే సన్యసిద్దామనుకుంటున్నాడేమో, తుచ్ఛజీవితంమీద విరక్తి కలిగినవాడేమో తన మునుముందటివేషం కొంతవరకూ ఇల్లానే వుండబోతుందేమో, గురుచరణంవేషం చూడగానే చిదానందం కళ్ళు చెమ్మగిల్లాయి.

గురుచరణం అదృష్టవంతుడు. అతి చిన్నప్రాయంలోనే దైవభక్తి, సత్ప్రవర్తన పూజాపునస్కారాలు, జపతపాలు మొదలయిన సద్బ్రాహ్మణ సంప్రదాయాలు అలవర్చుకున్నాడు. గురుచరణం యింతటివాడు కావడానికి కారణం శ్రీ చిన్మయానందేంద్ర సరస్వతీ స్వాములవారు. ఆయనే గురుచరణానికి గురువు. ఆయనవద్దనే గురుచరణం, పరమశివుని పంచాక్షరి, షణ్ముఖుని షడ్వ్యక్షరి, అహిమర్దనుని అష్టాక్షరీ మంత్రోపదేశం పొందాడు.

ప్రస్తుతం గురుచరణం గురుదేవుల దర్శనార్థమై వెళ్తున్నాడు.

చిదానందం త్వరితంగా గురుచరణాన్ని గురించి తనకు తెలిసిందంతా ఒకసారి స్మృతికి తెచ్చుకున్నాడు. గురుచరణం అడిగినప్రశ్నకు సమాధానం చెప్పాలనే విషయం మరిచేపోయాడు,

'పూజనించి వస్తున్నావా, పూజకు వెళుతున్నావురా గురుచరణం?' అన్నాడు.

'ఇంకా వెళుతున్నానురా! గురువుగారు జపంచేసుకుంటూ వుంటారు. ఆయన సమాధిలోంచి లేచేవేళయింది. ఏమైనా చెప్పాల్సి వుంటే త్వరగాచెప్పు' అన్నాడు గురుచరణం.

చిదానందం గురుచరణాన్ని కొంచెం తికమకలుగా ప్రశ్నిద్దామనుకున్నాడు. అల్లాగయితే సన్యాస విన్యాసంలో అంతరార్థం గ్రహించవచ్చని.

'నీ కిప్పట్నించీ ఎందుకురా గురుచరణం ఈ వేషం? ఈ భక్తి, ఈ వేదాంతం నీకెందుకురా చాదస్తంకాక?' అన్నాడు.

'లోకోభిన్నరుచిః అన్నారు. నీ అభిప్రాయం నాతో ఏకీభవించడం సంభవించదు. అలానే ఐతే దేశం ఏనాడో బాగుపడి వుండేది. నువ్వు నా ప్రాచీన సంప్రదాయాన్ని దూషించినా నేనేమీ అనుకోను. ఒకరు దూషించినా, భూషించినా సమానంగ గ్రహించలేనివాడు ఎందుకూ పనికిరాడు. మంచిచెడుగుల్ని ఒకేవిధంగాభావించి, సర్వం భగవదిచ్ఛని, మనచేతిలో ఏమీలేదని తెల్సుకుని సుఖదుఃఖాల్ని చిరునవ్వుతో ఆహ్వానించినవాడే భక్తుడుకావడానికి అర్హుడు. కాని ముఖ్యంగా నువ్వు తెలుసుకోదగ్గ విషయం ఒకటి. అంత నాస్తికత్వం అవలంబించేకన్నా భగవంతుడన్నా, ఆత్మన్నా, ఏమిటో మా గురువుగారివంటివారిదగ్గర తెలుసుకోయత్నించుము. ఆయన నీ సందిగ్ధాలన్నీ నివృత్తి చేయగలరు. ఆయనచెప్పింది నీకు నచ్చని పక్షంలో, నువ్వది అవలంబించకు. నీకింతగా ఉపదేశిస్తున్నానని అనుకోకు. నేనేపాటివాణ్ణి గనుక నీకు చెప్పడానికి? ఇలా నువ్వేకాదు. మహామహులే నాస్తికులై యోగీంద్రుల్నీ, సన్యాసుల్నీ దర్శించి, వారుచెప్పింది అవగాహనచేసుకుని శిరస్సులొంచారు.

ఐనా నువ్వొక్కటి ఆలోచించురా చిదానందం! మొన్న మొన్నటి వివేకానందులు, అరవిందులు, తదితర మహాఋషులు, ఈ నాస్తికులపాటి తెలియకేనా ప్రపంచంలో ప్రఖ్యాతి సంపాదించారు? వివేకానందులు ఎన్నాళ్ళు జీవించేరో తెలుసా? ముప్పైఎనిమిదేళ్ళు. ఈ స్వల్పవయస్సులో ప్రపంచంలో ఉపన్యాసాలిచ్చి, ప్రపంచ ప్రజానీకానికి ఆత్మ పరమాత్మ లేమిటో విడమర్చి చెప్పలేదా? వాళ్ళు నీపాటి ప్రశ్నలు వేయలేకేనా, ఆయనకు జేజేలర్పించి శిష్యులయ్యారు? కొమ్ములు తిరిగినవాళ్ళే ఆస్తికులుగా మారేరే!' గురుచరణం ఏకధాటిని ఉపన్యాసం దంచాడు.

చిదానందానికి కళ్ళంబట నీళ్ళుతిరిగాయి. ఒచ్చేకన్నీరు మిత్రుడు చూడకుండా తుడిచేసి 'అయితే భక్తిమార్గంలోపడి, భగవత్పూజలు మనస్ఫూర్తిగాచేస్తే, ఫలితం ఉంటుందంటావా గురుచరణం?' అని జాలిగా ప్రాధేయపడ్డాడు.

'ఎందుకుండదు? భగవంతుడు నీకు సర్వవిధాలా అండగా వుంటాడు. సాధనచెయ్యి. కృషిచెయ్యి. శుశ్రూషచెయ్యి. ముఖ్యంగా నీవంటివారే ముందంజవేయాలి. నీపేరుకూడ ఒక భగవద్భక్తునిపేరులాగ ముచ్చటగావుంది. నీ అదృష్టం ఏం చెప్పను?' అన్నాడు గురుచరణం.

'ఆ పేరులో ఏముందిరా గురుచరణం! పేరుగొప్ప, ఊరు దిబ్బాను! ఆ చరణ ముఖ్యంగాని...'

'నువ్వన్నదీ నిజమేలే! అబద్ధాలకోరుకి సత్యమూర్తిని, దుర్మార్గుడికి సన్యాసిరావని, సానిదానికి సుశీలాదేవి అనీ, ఓనమాలు రాని దానికి సరస్వతీదేవి అనీ నామధేయాలుంటవి అది నాకూ తెలుసు...'

'మరి?—'

'ఆ పేర్లు సార్థకం చేసుకోవాలని నేనసేది. పోనీ నువ్వేచెప్పు, పండితపుత్రులంతా కుంతలేనా? వాళ్ళుకూడా అఖండ విద్యావేత్తలై తండ్రులకన్నా ఎక్కువకీర్తి తెచ్చుకోడం లేదూ? అలా అది నిజమే అయిపోతూంటే, ఏ కాస్త తెలివున్నవాడూ ఉపాధ్యాయవృత్తి అవలంబించడు. అప్పుడు దేశంలో చదువులు, కళలు నున్నఅయి పాఠశాలలు, కళాశాలలు మూసివేతురా? ఇగిచెప్పు ముందు!' అంటూ గురువుగారికి పూజాపదార్థాలు అందివ్వడానికి ఆశ్రమానికి వెళిపోయాడు గురుచరణం.

గురుచరణం చెప్పిందంతా తలకి పట్టించుకున్నాడు చిదానందం. గురుచరణం మధురాధరంలోంచి వచ్చిన సుధారస సుభాషితాలని గిర్రున వెనక్కిత్రిప్పి వల్లెవేసుకున్నాడు. ఇక తను చేయవలసిందేమిటో తెలీడంలేదు. గురుచరణం సాక్షాత్తూ అతని గురువు! త్రిమూర్తి స్వరూపుడు! తన జ్ఞాననేత్రం విప్పాడు.

వెలిగించబోయే సిగరెట్టుని కాళ్ళక్రింద పడేసి నలిపేశాడు చిదానందం. 'వెధవ అలవాటు!' అని పళ్ళు పటపట కొరికాడు. ఇంటిముఖం పట్టాడు.

రాత్రి మంచంమీదనుంచి ఇటూ, అటూ దొర్లుతున్నాడు చిదానందం. నిద్రపట్టడంలేదు. కుటుంబం పెద్దది కాకపోయినా, ఆ వున్న వాళ్ళుచాలు అతన్ని గల్లంతు చేయడానికి. భార్య చీటికీ, మాటికీ పుట్టింటికి పోతాననటూంటుంది. ఆమె నిజంగా వెళిపోయినా బాగుండును. తనుకూడా మరోదారి చూసుకోవచ్చు. ఆమె ఇదుగో, అదుగో అంటుంది కాని కదలదు, వదలదు.

'దీనికంతటికీ కారణం వెధవడబ్బుకదా!' అనుకున్నాడు చిదానందం. 'డబ్బు ఎంత పనైనా చేయిస్తుంది. ఎన్నో పాపపు పనులకి పురిగొల్పుతుంది. ఎన్నో ఘోర నేరాలు చేయిస్తుంది. ఎన్నో అబద్ధాలు చెప్పిస్తుంది. ఒక్క అబద్ధాన్ని కప్పిపుచ్చడానికి వంద అబద్ధాలు చెప్పాలి. అందుచేత ఈ మిథ్యాజగత్తులోంచి బయటపడ్డానికి వైరాగ్యమే ఉత్తమమైంది. మహా యోగి వేమనకూడాయింతే కదా!'

*       *       *

చిదానందం ముస్తాబై మెయిన్ బజారులోంచి పోతున్నాడు. చిదానందం రూపురేఖలు చూసి గురుచరణం ఆశ్చర్యపోయాడు. చిదానందంలో పెద్దమార్పు కనబడ్డాది.

ధగధగలాడే సిల్కు సూటు, హేటు, నెక్టై, జేబులో చేతులు, అఖరిని నోట్లో సిగరెట్టువుండి, ఒక్కపోజు విసిరేడు చిదానందం. అతనికి గురుచరణం ఎదురుకావడమే అపశకునం.

'ఇదేమిట్రా చిదానందం! ఏమిటి యిలా మారిపోయావు? ఈ వేషం ఏమిటి? నోట్లో అదేమిటి? అయ్యో! తుచ్ఛసౌఖ్యాలికి లోనవుతున్నావా? నిన్న నే చెప్పిందంతా యేమైంది? వైరాగ్యంమాట మరిచావా? శివ శివా!' వాపోయాడు గురుచరణం.

ఇందుకు చిదానందం ఖరాకండీగా ఒకటే జవాబు చెప్పాడు.

"డబ్బులేకపోతే వైరాగ్యంగాని డబ్బువుండగా ఎందుకు? నీ కెలాగూ డబ్బులేదు. అందుకే నీకది చెల్లింది. నాకూ నీలా నే దుర్గతి పడుతుందనుకున్నాను. కాని అదృష్టం తన్నుకొచ్చి, ఓ లాటరీలో లకారం సంపాదించాను. నీకు సంసార వైరాగ్యం కలిగితే, నాకు 'వైరాగ్యంమీదే వైరాగ్యం కలిగింది ఫ్రెండూ! సారీ, నీపేరేమిటో మరచాను. వొస్తానుమరి, నాకోసం డాన్సింగ్ గర్ల్ ఎదురు చూస్తూంటుంది. టాటా!" అంటూ కాస్మాపాలిటన్‌లోదూరాడు, తప్పతాగి తందనాలు త్రొక్కడానికి.

---

## పెడర్థం

గోపాల్:—ఒరే రామం భార్యాభర్తలు పండుకొని యేమిజేస్తారురా?

రామం:—ఏమో నాకు తెలియదు బాబూ అన్నాడు సిగ్గుతో.

గోపాల్:—అయితే నేను చెప్తా విను. భార్యాభర్తలు పండు కొని తింటారురా.

రామం:—అదెలా అన్నాడు.

గోపాల్:—వారు పండు కొనుక్కొని తింటారు కాదట్రా అన్నాడు.

కుసుమంచి వెంకటేశ్వరరావు.